క్లుప్తంగా

నేడు నులిపురుగుల దినోత్సవం

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్ పరిధిలో మంగళవారం జాతీయ నులి పురుగుల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఆలెబండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మదనపల్లె డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మి తెలిపారు. 1–2 వయస్సు పిల్లలకు 200 ఎంజీ(అర్ధమాత్ర), 2–19 ఏళ్ల పిల్లలకు 200 ఎంజీ(ఒక మాత్ర) ఇస్తారని తెలిపారు. భోజనం తరువాత అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు మాత్రలను పిల్లలకు మింగించాలని సూచించారు.

పోలీసు స్టేషన్‌కు చేరిన ఇంటర్ పశ్నపత్రాలు

మదనపల్లె సిటీ: ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలు ప్రత్యేక బాక్సుల్లో మదనపల్లె టు టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరాయి. స్టేషన్‌లో ప్రత్యేక గదిలో ప్రశ్నపత్రాలను బాక్సుల్లో ఏర్పాటు చేశారు. 15 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు పరీక్షల ఏర్పాట్లును సిద్ధం చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి గాయపడిన వ్యక్తి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. వివరాలిలా.. ఆదివారం రాత్రి పుంగనూరు రోడ్డులోని జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని బుగ్గకాల్వకు చెందిన అనిల్‌కుమార్(26)తో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. బాధితులను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: కుటుంబ సమస్యల కారణంగా వ్యక్తి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన పెద్దమండ్యం మండలంలో సోమవారం జరిగింది. ముసలికుంట పంచాయతీ తుమ్మల వంకతాండాకు చెందిన వెంటకరమణనాయక్ కుమారుడు ఎం.శ్రీనివాసులు (36) కుటుంబ సమస్యలు కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు తంబళ్లపల్లె సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్సలు అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. స్థానికుల వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు పొందుతున్నాడు.

భవానీనగర్‌లో చోరీ

మదనపల్లె: పట్టణ శివారు ప్రాంతమైన భవానీనగర్‌లో చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు..భవానీనగర్‌లో నివాసమున్న మనోజ్‌కుమార్‌రెడ్డి రెండు రోజుల క్రితం బంధువుల వివాహ కార్యక్రమం ఉండటంతో ఊరికి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి ఉండటం గమనించారు. ఇంటిని పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీ ఘటనపై తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.1.50 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, ఒక ల్యాప్‌టాప్ చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఉట్ల తిరునాల



తిరునాలలో భక్తుల సందడి

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరురోడ్డులోని కనుమలో గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉట్ల తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆలయం ఎదుట ఉట్లమానును యువకులు ఎంతో ఉత్సాహంగా ఎక్కారు. మహిళలు అమ్మవారికి దీలు,బోనాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి గంగమ్మ జాతర

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో మంగళ, బుధవారం గంగమ్మ, గౌరమ్మల జాతర నిర్వహించనున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఎప్పటిలాగే జాతరలో ఎక్కడా..ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

మదనపల్లె: రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లెలో సోమవారం జరిగింది. తట్టివారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి భార్య వి.రాధమ్మ(58) వ్యక్తిగత పనులపై పట్టణంలోని వెళ్లి తిరిగి ఆటోలో తట్టివారిపల్లెకు చేరుకుంది. ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఆమెను ఢీకొంది. ప్రమాదంలో బాధితురాలు గాయపడగా గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటెత్తిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు

- ఎమ్మెల్సీ ఎన్నిక ప్రశాంతం
- సాధారణ ఎన్నికలను తలపించిన ఓటింగ్ శాతం
- రెట్టించిన ఉత్సాహంతో భారీగా పోలింగ్
- ఎండను సైతం లెక్కచేయకుండా ఓటింగ్
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీ



బీటీ కళాశాలలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఓటర్లు



వాల్మీకిపురం : పోలింగ్ కేంద్రం బారులు తీరిన ఓటర్లు

మదనపల్లె : సాధారణ ఎన్నికలను తలపించే రీతిలో, ఎండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పట్టభద్రులు, ఉపాధ్యాయులు పోటెత్తారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచే భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు ప్రాధాన్యతను తెలిపారు. ఎన్నికలు ఈవీఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్‌తో నిర్వహించడం, 22 మంది వరకు అభ్యర్థులు పోటీలో ఉండటంతో, వారందరి పేర్లను పరిశీలించుకుని, తమకు నచ్చిన అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో ఓటువేసేందుకు ఒక్కో ఓటరుకు 2–4 నిమిషాల సమయం పట్టింది. అయినప్పటికీ పట్టభద్రులు సహనం కోల్పోకుండా, పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా క్యూలో నిల్చుని ఓటుహక్కును వినియోగించుకున్నారు. పురుషులతో పాటు మహిళా పట్టభద్రులు పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల నియోజకవర్గ గ్రాడ్యుయేట్స్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రాతిపదికన మదనపల్లె రెవెన్యూడివిజన్ పరిధిలోని పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గ్రాడ్యుయేట్స్ భారీగా కదిలిరావడంతో అంచనాలకు మించి రికార్డుస్థాయిలో ఓటింగ్ నమోదైంది. పలు కేంద్రాల వద్ద ఉదయం నుంచే రద్దీ కనిపించింది. కొన్నిచోట్ల పోలింగ్ మందకొడిగా ప్రారంభమైనా.. మధ్యాహ్నానికి పుంజుకుంది. ఓటుహక్కు వినియోగంపై అటు ఎన్నికల సంఘం, ఇటు ప్రభుత్వం విస్తృతంగా అవగాహన కల్పించడం, అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేయడంతో పోలింగ్‌కు మంచి స్పందన లభించింది. మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళి జెడ్పీహైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని జెడ్పీహైస్కూల్, బీటీ కళాశాలలో పోలింగ్ సరళిని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

మందకొడిగా ప్రారంభమై....

ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ పట్టణ ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట్ల ముందుగా మందకొడిగా సాగింది. ఉదయం 10 గంటల సమయానికి మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో పట్టభద్రులు 6 శాతం, ఉపాధ్యాయ ఓటర్లు 13 శాతం పోలింగ్ నమోదైంది. దీంతో అటు రాజకీయ పార్టీలు, ఇటు అధికారుల్లో కొద్దిగా ఆందోళన కనిపించింది. మధ్యాహ్నం 12గంటలకు గ్రాడ్యుయేట్స్ 24.82శాతం, టీచర్స్ 42.70శాతం నమోదైంది. తర్వాత మెల్లమెల్లగా పుంజుకుంటూ, మధ్యాహ్నం 2 గంటలకు గ్రాడ్యుయేట్స్ 41.29 శాతం, టీచర్స్ 73.19శాతం, సాయంత్రం 4గంటలకు పోలింగ్ సమయం ముగిసేటప్పటికి పట్టభద్రులు 66.81శాతం, ఉపాధ్యాయులు 88.51 శాతం నమోదైంది. పోలింగ్ ముగిసే సమయానికి కూడా పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రం 317, బీటీ కళాశాలలోని పోలింగ్ కేంద్రం 313లో దాదాపుగా 200 మందికి పైగా ఓటర్లు క్యూలో నిల్చుని ఉన్నారు. దీంతో అధికారులు వారికి టోకెన్లు జారీచేసి ఓటేసేందుకు అవకాశం కల్పించడంతో సాయంత్రం 5.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మదనపల్లె డివిజన్‌లోని 15 మండలాల్లోని గ్రాడ్యుయేట్స్ ఓటర్లు..23,838 మందికి 16,845 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 70.66 శాతం నమోదైంది. టీచర్స్ 1,932 మందికి 1,728 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 89.44 శాతం నమోదైంది.

అత్యధికం, అత్యల్పం....

మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు గ్రాడ్యుయేట్స్‌కు సంబంధించి తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట పోలింగ్‌కేంద్రం .305లో 596 ఓట్లకు 463 మంది ఓటుహక్కు వినియోగించుకోగా,77.68 శాతంతో అత్యధిక పోలింగ్ నమోదైంది. పీలేరునియోజకవర్గంలోని కే.వి.పల్లె పోలింగ్ కేంద్రం 308 లో 953 మంది ఓటర్లకు 592 మంది ఓటుహక్కు వినియోగించుకోగా 62.12తో అత్యల్పపోలింగ్‌శాతం నమోదైంది. టీచర్స్ విషయానికి వస్తే మదనపల్లె నియోజకవర్గం నిమ్మనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, పీలేరు నియోజకవర్గంలోని కలకడ పోలింగ్ కేంద్రాల్లో 100శాతం పోలింగ్ నమోదు కాగా, తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం పోలింగ్ కేంద్రం 164లో అత్యల్పంగా 82.76 శాతం నమోదుకాగా, 29 మంది ఉపాధ్యాయులకు 24 మంది మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు

వాల్మీకిపురం: మండలంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా సాగాయి. మండలంలో 1248 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా ఇందులో 871 ఓట్లు పోలయ్యాయి. వీరిలో 592 మంది పురుషులు, 279 మంది మహిళలు ఉన్నారు. అలాగే మండలంలో ఉపాధ్యాయ ఓటర్లు 66 మంది కాగా 61 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో పర్యటించి, అక్కడున్న అధికారులతో మాట్లాడి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

తంబళ్లపల్లె: మండలంలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తహసీల్దార్ కళావతి, ఎంపీడీవో ఆనంద్‌కుమార్‌లు, ఎమ్మార్సీ కార్యాలయంలో రెండు పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. పట్టభద్రులు 810 మందికి గాను 408 మంది పురుషులు, 174 మంది మహిళలు ఓటును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 13 మందికి గాను 11 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ములకలచెరువు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం జరిగిన ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. మండలం మొత్తం 49 మంది టీచర్లు, 654 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ 92.45 శాతం, పట్టభద్రులు 71.94 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి శ్రీహరి చెప్పారు. పోలింగ్ కేంద్రాలను జిల్లా ఏఎస్పీ రాజ్‌కమల్ పరిశీలించారు.

రామసముద్రం: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓటర్లు మొత్తం 1019 మందికి గాను 756 మంది ఓటహక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు మొత్తం 20 మందికి గాను 18 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని తహశీల్దార్ రవి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదు పోలింగ్ కేంద్రాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించారు. మండలంలో ఉపాధ్యాయ ఓటర్లు 469కి గానూ 440 పోలై 94 శాతం నమోదైనట్లు తెలిపారు. అలాగే పట్టభద్రుల ఓట్లు 3148కి గానూ 2245 ఓట్లు నమోదై 71.31 శాతంగా నమోదైనట్లు తహశీల్దార్ వివరించారు. రాయచోటి డీఎస్పీ శ్రీధర్ పీలేరు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.

కేవీపల్లె : మండలంలో పట్టభద్రుల ఓట్లు 953 ఉండగా 597 ఓట్లు నమోదై 62.64 శాతం పోలైనట్లు తహశీల్దార్ నరసింహులు తెలిపారు. అలాగే ఉపాధ్యాయ ఓట్లు 42కు గానూ 35 ఓట్లు నమోదై 83.33 శాతం పోలైనట్లు వివరించారు.

బి.కొత్తకోట: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల ఓట్లు 1,342 ఉండగా 975 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయ ఓటర్లు 68 మంది ఉండగా 63 మంది ఓటుహక్కను వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను ఏఎస్పీ రాజ్‌కమల్ తనిఖీ చేశారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: గుర్రంకొండలో పట్టభ్రధుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 66.10 పోలింగ్ శాతం నమోదైనట్లు పీఓ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియలో భాగంగా మండలం మొత్తం మీద 1310 పట్టభద్రుల ఓట్లగానూ 866 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో మొత్తం 50 మంది ఓట్లగానూ 47 ఓట్లు పోలయ్యాయి.

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో సోమవారం జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలో మొత్తం 1,023 పట్టభద్రులు ఉండగా 724 మంది (74 శాతం) మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 29 మంది ఉండగా 20 మంది (83 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల సెక్టోరల్ అధికారి శివశంకర్, తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు.

పెద్దమండ్యం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 13 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే 728 మంది పట్టబద్రులు ఉండగా 549 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

కలికిరిలో..

కలికిరి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు 1554 ఓట్లకు గాను రెండు పోలింగ్ బూత్‌లలో 1069 ఓట్లు పోలై 68.79 శాతం ఓటింగ్, ఒక పోలింగ్ బూత్‌లో 93 ఉపాధ్యాయ ఓట్లకు గాను 83 ఓట్లు పోలై 89.24 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కురబలకోటలో..

కురబలకోట: కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పట్ట భద్రుల ఓటర్ల పోలింగ్ 75.9 శాతం, ఉపాధ్యాయ ఓటర్లు 86 శాతం పోలింగ్ జరిగింది. మదనపల్లె డీఎస్పీ కేశప్ప పోలింగ్‌ను పర్యవేక్షించారు.



మదనపల్లె జెడ్పీహైస్కూల్లో ఓటుహక్కు వినియోగించుకున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



రామసముద్రంలో ఓటు వేసేందుకు..



గుర్రంకొండలో...



పెద్దతిప్పసముద్రంలో....







ములకలచెరువు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజ్‌కమల్, పీలేరు : పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీధర్, బి.కొత్తకోటలో ఓటర్లు ఇలా..

ఘనంగా సత్యమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

వాల్మీకిపురం: మండలంలోని గండబోయనపల్లి పురాతన కోట ప్రాంగణంలో ఎండోమెంట్, గ్రామస్థుల సహకారంతో పునఃనిర్మించిన సత్యమ్మ తల్లి ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కనుల పండువగా సాగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎంపీపీ అరుణమ్మ, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గండబోయనపల్లితో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్రప్ప, నాయకులు శీనా, రాజన్న, సత్తిపండు, క్రిష్ణాంజనేయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఫీల్డ్ జనరల్ మేనేజర్ నవనీత్‌కుమార్

కలకడ : యూనియన్ బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ నవనీత్‌కుమార్ కోరారు. సోమవారం కలకడ శాఖను నూతన భవనంలోకి బదిలీ చేసి ఖాతాదారులకు లాకర్ సౌకర్యం కల్పించారు. బ్యాంకు ఖాతాదారున్ని గౌరవించి, ఉత్తమ సేవలు అందజేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు సైతం ప్రైవేటు వ్యక్తులను కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకుల్లో తమ డబ్బును డిపాజిట్ చేస్తే భద్రంగా ఉంటుందన్నారు. మహిళలు, రైతులు, ఋణ గ్రస్తులు బ్యాంక్ సిబ్బందికి సహకరించి సకాలంలో రుణాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, సింగల్ విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ, తిరుపతి రీజనల్ అధికారి రాంప్రసాద్, కలకడ శాఖ మేనేజర్ దయాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



యూనియన్ బ్యాంక్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఫీల్డ్ జనరల్ మేనేజర్ నవనీత్‌కుమార్, తదితరులు

ఘనంగా వేంకటరమణుడి శయనోత్సవం

రామసముద్రం: రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి ఉత్సవాల్లో బాగంగా సోమవారం స్వామివారికి శయనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారిని పురవీధుల్లో పుష్ప పల్లకీ పై ఊరేగించారు.



పుష్పక అలంకారంలో స్వామి వారు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె సిటీ: గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన 35వ ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో మదనపల్లెకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–14 కేటగిరీలో 9 మంది విద్యార్థులు కటా, కుమితే విభాగాల్లో బంగారు పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ సదాశివ తెలిపారు. మహేష్, జస్వంత్, కుందన్, షహబాజ జ్ఞానేశ్వర్‌రెడ్డి, వరుణ్‌లు బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. యోగనంద, శశాంక్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. వీరిని కరాటే మాస్టర్లు, కోచ్‌లు అభినందిచారు.

వైభవంగా బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలోని విద్యుత్ స్టేషన్ వద్ద వెలసిన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం గ్రామస్తులు నూతన విగ్రహ ప్రతిష్టను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గణపతి పూజ, గోవు పూజ, హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : అఖిల భారత రైతుకూలీ సంఘం రాయచోటి మండల నేతలు ఎం.వెంకటచలపతి, కదిరప్పలపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠినచర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అన్నమయ్య జిల్లా నేత మావులూరి విశ్వనాథ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఏపీ రైతు కూలీ సంఘం నేతలతో కలసి దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్‌ను వినియోగించుకునే విషయంలో కాటినేనివాండ్లపల్లెకు చెందిన మెరుగు వెంకటాచలపతి, కదిరప్పలు, మెరుగు రామక్రిష్ణ, వెంకటరమణలు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరుగుతుండగా పథకం ప్రకారం చెందిన కాటినేని చిన్నమల్లప్ప, అక్కుమల్లమ్మతో పాటు మరో 9మంది కత్తులు, కర్రలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారన్నారు.